కొనేదెలా.. తినేదెలా?

- ఆకాశాన్నంటిన కూరగాయల ధరలు
- విలవిల్లాడుతున్న సామాన్యులు

కూరగాయల ధరలు మండిపోతున్నాయి. రైతుబజార్లు, పూర్ణామార్కెట్‌లోనే వీటి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇక ఓపెన్ మార్కెట్‌లో అయితే ధర వింటేనే కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. బయట కొన్ని రకాల కూరలు రూ. 80 కూడా అమ్ముతున్నారు. పెరిగిన ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలు ఏం కొనాలి.. ఏం తినాలి.. అంటూ నిట్టూరుస్తున్నారు.



ధరల పెరుగుదలతో పూర్ణామార్కెట్‌కు తగ్గిన వినియోగదారుల రద్దీ



పూర్ణామార్కెట్ బయట కూరగాయల అమ్మకాలు

జగదాంబ: అమాంతం పెరిగిన ధరలతో కూరగాయలు కొనేందుకు వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు అందని విధంగా కూరగాయల ధరలు పెరిగిపోయాయి. ఉల్లిపాయల నుంచి కొత్తిమీర వరకు ఏ ఒక్కటి కొనాలన్నా భయపడే పరిస్థితి నెలకొంది. జేబులో రూ. 5 వందల నోటు పెట్టుకుని వెళ్లినా సంచి నిండని విధంగా మార్కెట్ ధరలు భయపెడుతున్నాయి. వంకాయలంటేనే అమ్మో దురదలు అంటారు. అటువంటి వంకాయలు కూడా ఇప్పుడు కిలో రూ. 50 వరకు అమ్ముతున్నారు. నగరంలో ఎన్ని రైతుబజార్లున్నా తాజా కూరగాయల కోసం పూర్ణామార్కెట్‌కు జనం తరలి వస్తారు. అందుకే ఎప్పుడు చూసినా అక్కడ విపరీతమైన రద్దీ ఉంటుంది. అటువంటిది పూర్ణామార్కెట్ కూడా పెరిగిన ధరల వల్ల కొనుగోలుదారులు లేక వెలవెలబోతోంది. ప్రతి సంవత్సరం జూలై, ఆగస్టు మాసాల్లో కూరగాయల ధరలు పెరగడం తెలిసిందే. పూజలు, వ్రతాల కాలం కాబట్టి కూరగాయలకు డిమాండ్ ఉంటుంది. కానీ ఈ ఏడాదిలా ముందెన్నడూ ధరలు ఇంతలా పెరగలేదని కొనుగోలుదారులు వాపోతున్నారు.

పూర్ణామార్కెట్‌లో ధరలు ఇలా..

వంకాయలు	రూ. 50 నుంచి రూ.60	బీన్స్	రూ. 80
నల్లవి	రూ. 50	బెండకాయలు	రూ. 50 నుంచి రూ.60
టమాటాలు	రూ. 35 నుంచి రూ.40	దొండకాయలు	రూ. 30
ఉల్లిపాయలు	రూ. 38 నుంచి రూ.40	పొటల్స్	రూ. 30
కొత్తిమీర	రూ.20	కాలీఫ్లవర్	రూ. 50
వెల్లుల్లి	రూ.200 నుంచి రూ.280	క్యాబేజీ	రూ. 50
అల్లం	రూ.150 నుంచి రూ.170	క్యారెట్	రూ.30 నుంచి రూ. 40
పచ్చిమిర్చి	రూ. 60	బీట్‌రూట్	రూ.30
క్యాప్సికం	రూ.50 నుంచి రూ.60	సేమదుంపలు	రూ.40
బీరకాయలు	రూ.50	బంగాళాదుంపలు	రూ.50
చిక్కుడుకాయలు	రూ. 80	ఆనపకాయలు	రూ.15 నుంచి రూ.20
గోరుచిక్కుడు	రూ. 50	ములక్కాడ మూడు	రూ.20

బయట మరింత దారుణం..

రైతుబజార్లు.. పూర్ణామార్కెట్‌లోనే ధరలు ఇలా ఉంటే ఇక ఓపెన్ మార్కెట్లు, రోడ్డుసైడ్ వ్యాపారాలు చేసే వ్యాపారుల వద్ద కూరగాయలు ధరలు గుండె దడ తెప్పిస్తున్నాయి. సాధారణం కన్నా ఎలా లేదన్నా రూ. 20 నుంచి 30 వరకు అదనపు ధరలకు విక్రయిస్తున్నారు. రైతుబజార్లు, పూర్ణామార్కెట్‌లో రూ. 50కి విక్రయించే కూరగాయలు బయటి మార్కెట్లలో రూ. 80కి విక్రయిస్తున్నారు.

కూరగాయలు కొనలేం..



కూరగాయల ధరలు బాగా పెరిగిపోయాయి. ఇంతటి ధరలు ఎప్పుడూ చూడలేదు. అల్లం ధర మరీ కొండెక్కి కూర్చుంది. ఇలా అయితే ఇంకేం తింటాం. వెల్లుల్లి ధరలూ అలాగే ఉన్నాయి. ధరలు ఇలాగే ఉంటే ఇక కూరగాయలు తినలేం.

–సత్యవతి, ప్రసాద్‌గార్డెన్స్

ధరలు మండిపోతున్నాయి..



గతంలో రెండు వందలతో కూరల బజారుకెళ్తే సంచి నిండిపోయేది. ఇప్పుడు కేవలం ఉల్లిపాయలు, టమాటాలు మాత్రమే వస్తున్నాయి. ఏది చూసినా యాభై నుంచి వంద వరకు ధరలున్నాయి. పచ్చిమిర్చి ధర కూడా పెరిగిపోయింది.

– ఆదినారాయణ, వెలంపేట

క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతలకు బాండ్ అందజేస్తున్న సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం నగరంలోని రెల్లివీధికి చెందిన కుంచుమాంబ కిరాణా వర్తక సంఘం ప్రతినిధులు రూ.1,00,011 విరాళం అందజేశారు. దేవస్థానం తరపున దాతలకు సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు బాండ్ అందజేసి స్వామివారి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో పీఆర్వో నాయుడు పాల్గొన్నారు.

రిటైర్డ్ తహసీల్దార్ రవికి సన్మానం



రవిని సన్మానిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: కలెక్టరేట్‌లో ల్యాండ్ ప్రొటెక్షన్ తహసీల్దార్‌గా పని చేస్తున్న వీకేఎస్ రవి బుధవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని రవిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఆర్వో సీతారామ్మూర్తి, పరిపాలనాధికారి (ఏవో) కె.వి. ఈశ్వరరావు, జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఏ త్రినాథ్, కార్యదర్శి సీహెచ్ వెంకట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పద్య కవయిత్రి కన్నేపల్లి మృతికి సంతాపం

సీతంపేట: నగరానికి చెందిన పద్య కవయిత్రి కన్నేపల్లి వరలక్ష్మి క్యాన్సర్‌కు చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి చెన్నైలో మరణించారు. ఆమె సెయింట్ జోసఫ్ సెకండరీ పాఠశాలలో గ్రేడ్-1 తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేశారు. 15 వరకు పద్య కావ్యాలు రచించారు. ఛందస్సులో ఎన్నో ప్రయోగాలు చేసి సాహితీ ప్రోతస్విని బిరుదు పొందారు. ఈమె వయసు 75 ఏళ్లు. భర్త టీచర్‌గా పనిచేస్తూ కాలం చేశారు. వీరికి ఇద్దరు కుమారులు. ఒక కుమార్తె. విశాఖ చరిత్రలో కన్నేపల్లి వరలక్ష్మి నాలుగో పద్య కవయిత్రి అని, ఈమె మరణం సాహితీ ప్రపంచానికి తీరని లోటని రచయిత డి.వి.సూర్యారావు సంతాపం తెలిపారు. సాహితీ ప్రముఖులు వరలక్ష్మి మృతికి బుధవారం సంతాపం ప్రకటించారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఈవో రమాబాయి ఆధ్వర్యంలో గణపతి పూజ అనంతరం అమ్మవారికి పంచామృతాభిషేకం జరిగింది. తదుపరి భక్తులు స్వహస్తాలతో అమ్మవారి జలాభిషేకం చేశారు. అర్చకుడు శ్రీనివాస్ భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు చేశారు. సాయంత్రం కూడా అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి పూజలు చేసి మరోసారి జలాభిషేకం చేశారు. ఆలయ ప్రతినిధులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఎప్పటి చెత్తను అప్పుడే తరలించాలి



అధికారులను ఆదేశిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

జగదాంబ: యార్డులో చెత్తను ఏ రోజుకు ఆ రోజు కాపులుప్పాడ తరలించి యార్డును జీరో చేయాలని కమిషనర్ పి.సంపత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన జీవీఎంసీ 35వ వార్డు టౌన్ కొత్తరోడ్డులో ఉన్న డంపింగ్ యార్డును, క్లోజ్ కాంపెక్ట్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జోన్-3, 4, 5 ప్రాంతాల నుంచి వచ్చిన చెత్తను వెంటనే యార్డుకు తరలించాలన్నారు. అక్కడి నుంచి కాపులుప్పాడకు పంపిచాలన్నారు. క్లోజ్ కాంపెక్ట్ వాహనాల్లో సామర్థ్యం మేర పంపించాలన్నారు. తక్కువగా పంపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అదే విధంగా రోడ్డుపైన డెబ్రిస్, సిల్ట్, ఇసుక ఉండకూడదన్నారు. వాటిని కూడా జీవీఎంసీ వాహనాల్లో డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. ముఖ్యంగా యార్డు నుంచి దుర్వాసన రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెత్తకు ప్లాస్టిక్ కవర్లు చుట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ సత్యనారాయణరాజు, మెకానికల్ ఈఈ దిలీప్, ఇంజినీరింగ్ ఈఈ సంతోష్‌కుమారి, ఏఈ జాన్సన్, ఏఎంహెచ్‌వో ఎ. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి జర్నలిస్టుల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పలు జర్నలిస్టు సంఘాల నాయకులు

మహారాణిపేట: విశాఖ జిల్లాలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులు స్థానికంగా పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారానికి సహకరించాలని కోరుతూ పలు జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు బుధవారం కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు గతంలో మాదిరిగా 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ఈ సందర్భంగా కోరారు. గత సంవత్సరం మాదిరిగానే వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్‌కు సంబంధించి జర్నలిస్టులు చెల్లించాల్సిన ప్రీమియం సీఎస్ఆర్ కింద చెల్లింపునకు సహకరించాలని, పెండింగ్‌లో ఉన్న ప్రెస్ అక్రిడేషన్లు జారీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ ఈ సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రాము, ఆర్.రామచంద్రరావు, ఉపాధ్యక్షుడు కె.చంద్రమోహన్, లోకల్ న్యూస్ పేపర్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సత్యనారాయణ, ధవళేశ్వరపు రవికుమార్ తదితరులు ఉన్నారు.

3న తుపాకీ సంస్కృతిపై సదస్సు



సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్ తదితరులు

సీతంపేట: ప్రపంచ వ్యాప్తంగా హెచ్చుమీరుతున్న తుపాకీ సంస్కృతిపై ఈ నెల 3వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో సదస్సు నిర్వహిస్తున్నట్టు ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ సంస్థ ప్రతినిధి నరవ ప్రకాశరావు తెలిపారు. కార్యక్రమ పోస్టర్‌ను బుధవారం గాంధీ సెంటర్‌లో సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ప్రపంచ శాంతిని కోరే మేధావులు సామాజిక కార్యకర్తలు పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో కృష్ణా యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య రామకృష్ణ, డాక్టర్ కె.వి.ఎస్.ఎన్.మూర్తి, అబ్దుల్ మునీర్, ముషాద్ పాల్గొన్నారు.

కేంద్ర నిర్లక్ష్యంతోనే రైలు ప్రమాదాలు

తాటిచెట్లపాలెం: కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగానే రైలు ప్రమాదాలు సంభవిస్తున్నాయని డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. మంగళవారం తెల్లవారుజామున జరిగిన రైలు ప్రమాదంపై ఆయన స్పందించారు. 10 ఏళ్లుగా రైలు ప్రమాదాలు జరుగుతున్నా.. అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం సరిగా స్పందించడం లేదన్నారు. సమస్యలను గుర్తించడం, పరిష్కరించడం వంటివి చేయడం లేదని, ఈ ప్రమాదాలకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. రైల్వేలో భద్రతా ప్రమాణాలు సరిగా లేకపోవడం, సిబ్బంది సమస్య వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ల పేరుతో హడావుడి చేస్తున్నారే గానీ.. సాధారణ, మధ్యతరగతి రైళ్లపై, ప్రయాణికుల సౌకర్యాలపై దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. తరచూ జరగుతున్న రైలు ప్రమాదాలపై పార్లమెంట్‌లో ప్రతిపక్ష, వామపక్ష, అభ్యుదయ ఎంపీలు ప్రశ్నిస్తున్నా.. దేశ వ్యాప్తంగా ప్రజలు ఉద్యమాలు నిర్వహిస్తున్నా.. స్పందించని రైల్వే మంత్రి తక్షణం రాజీనామా చేయాలని రాజు డిమాండ్ చేశారు.

పాడైన చిన్నారుల ఆట పరికరాలు



పాడైపోయిన గోకుల్ పార్క్‌లోని ఆట పరికరాలు

బీచ్ రోడ్డు: విశాఖ సాగర తీరం వెంబడి ఉన్న పార్కుల్లోని చిన్నారుల ఆట పరికరాలు పాడై మూలకు చేరాయి. వాటికి మరమ్మతులు చేపట్టే నాథుడు కరువయ్యారు. ఫలితంగా నిత్యం చిన్నారుల ఆట పాటలతో కళకళలాడే ఆ పార్కులు ఇప్పుడు బోసిపోయి దర్శనమిస్తున్నాయి. సందర్శకులను ఆకట్టుకునేలా తీరం వెంబడి పార్కులను జీవీఎంసీ అభివృద్ధి చేసింది. ముఖ్యంగా చిన్నారుల ఆడుకోవడం కోసం కోస్టల్ బాటరీ నుంచి వైఎంసీఏ వరకు పలు పార్కులను ఆట పరికరాలతో తీర్చిదిద్దింది. తీరానికి వచ్చిన తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ పార్కుల్లో ఆటలాడిస్తూ సముద్రాన్ని చూస్తూ సేద తీరేవారు. అయితే ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పార్కుల్లో ఉన్న ఆట పరికరాలు పూర్తిగా శిథిలమైపోయాయి. దీంతో సందర్శకులు నేరుగా తీరంలో కాసేపు సేదతీరి ఇంటికి వెళ్లిపోతున్నారు. కోస్టల్ బ్యాటరీ నుంచి వైఎంసీఏ వరకు గోకుల్ పార్క్, చిల్డ్రన్ పార్క్, ఎబిలిటీ పార్క్‌ను జీవీఎంసీ అభివృద్ధి చేసింది. వీటిలో గోకుల్ పార్క్‌లో ఆట పరికరాలు పూర్తిగా పాడైపోయాయి. వీటికి తక్షణమే మరమ్మతులు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

సేవా కార్యక్రమాలు సంతృప్తినిచ్చాయి



జ్యోతి వెలగించి సర్వ సభ్య సమావేశాన్ని ప్రారంభిస్తున్న శివాజీ

మహారాణిపేట: గడిచిన ఏడాదిలో సభ్యుల సహకారంతో మంచి కార్యక్రమాలు నిర్వహించడం సంతృప్తినిచ్చిందని ప్రేమ సమాజం అధ్యక్షుడు బుద్ద శివాజీ అన్నారు. బుధవారం డాబాగార్డెన్స్ ప్రేమ సమాజం ఆడిటోరియంలో సర్వసభ్య సమావేశాన్ని ఆయన జ్యోతి వెలగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రయం పొందుతున్న బాల బాలికలను ఉన్నత విద్యావంతులను చేయడమే లక్ష్యమన్నారు. శరణాలయంలో ఆశ్రయం పొందుతున్న ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా జీవించడమే కాకుండా ఆనందంగా ఉండాలన్నారు. ప్రేమ సమాజం అభివృద్ధికి సహకరిస్తున్న దాతలు, సభ్యులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. కార్యదర్శి కె.హరిమోహన్‌రావు ప్రేమ సమాజంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల నివేదిక వెల్లడించారు. కోశాధికారి ఎంవీవీకే గుప్త ఆదాయ వ్యయాలను వెల్లడించగా సభ్యులందరూ ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రేమ సమాజం ఉపాధ్యక్షులు మట్టపల్లి హనుమంతరావు, కేశప్రగడ నర్సింహారావు, సంయుక్త కార్యదర్శులు వి.మోహన్‌రావు, వి.కె.సురేష్ కుమార్, సలహాదారు డాక్టర్ పి.విశ్వేశ్వరరావు, ప్రత్యేక ఆహ్వానితులు, పూర్వ అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్, కార్యవర్గ సభ్యులు, జీవిత కాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక శాఖ మంత్రికి సమస్యల నివేదన



మంత్రి సుభాష్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ, ఆశ యూనియన్ల నాయకులు

జగదాంబ: రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ రంగ కార్యాలయాల్లో పని చేస్తున్న స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ, కనీస వేతనాలు చెల్లించాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కన్వీనర్ పి.మణి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం, వీవో, ఆర్పీలు, నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్న మహిళలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఎన్నికలకు ముందు రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కార్మికులు 42 రోజులు సమ్మె చేశారన్నారు. అప్పటి ప్రభుత్వం వీళ్లకు గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్, జీతాల పెంపుదల వంటి హామీలు ఇచ్చిందన్నారు. దానికి సబంధించి జీవోలు విడుదల అవ్వలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల మేనిఫెస్టోలో జీతాలు పెంచుతామని పేర్కొన్నారన్నారు. ప్రభుత్వం ఏర్పడి నెలలు కావస్తున్నా ఇంకా జీతాలు పెంచలేదన్నారు. అలాగే ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కేవలం రూ. 3 వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. వారి జీతాలు పెంచాలని కోరారు. మహిళలు పనిచేస్తున్న చోట లైగింక వేధింపుల నిరోధిక కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎం.వెంకటలక్ష్మి, అర్బన్ అధ్యక్ష, కార్యదర్శులు నూకరత్నం, కృప, ఆశ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పద్మ, మేరి తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ దేశాభివృద్ధికి ఆటంకం



సమావేశంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ కిశోర్‌బాబు

ఎంవీపీ కాలనీ: బాల కార్మిక వ్యవస్థ అనేది ఏ దేశం సమ్మిళిత అభివృద్ధికైనా ఆటంకం కలిగించే అంశమని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ ద స్టడీ ఆఫ్ సోషల్ ఇంక్లూజన్ ఇన్ యూనివర్సిటీస్ ఆధ్వర్యంలో చైల్డ్ లేబర్ ఎడ్యుకేషన్ అంశంపై జర్నలిజం విభాగం సమావేశ మందిరంలో బుధవారం జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ నిరక్షరాస్యత, సామాజిక వెనుకబాటు తనంతో పాటు అనేక అంశాలు చైల్డ్ లేబర్ ఎడ్యుకేషన్‌కు దారితీస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో సెంటర్ ఫర్ ద స్టడీ ఆఫ్ సోషల్ ఇంక్లూజన్ ఇన్ యూనివర్సిటీస్ వంటి సంస్థలు, ఎన్జీవోలు ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి తీసుకోవాల్సిన చర్యలపై మార్గదర్శకాలు అన్వేషించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం.సునీత, సెంటర్ ఫర్ ద స్టడీ ఆఫ్ సోషల్ ఇంక్లూజన్ ఇన్ యూనివర్సిటీస్ డైరెక్టర్ ఆచార్య సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయరూ..

ఎమ్మెల్యే వంశీకి నియోజకవర్గ ప్రజల లేఖ



ఎక్కడి గొంగళి అక్కడే అన్నట్టు అర్థాంతరంగా నిలిచిపోయిన పాతనగరం రోడ్డు విస్తరణ పనులు



పనులు నిలిచిపోవడంతో మూలకు చేరిన బుల్‌డోజర్

అయ్యా,

మేము దక్షిణ నియోజకవర్గ ప్రజలం. ఎన్నడూ లేని విధంగా విజయాన్ని మీ సొంతం చేశాం. మీరు వస్తే నియోజకవర్గ రూపు రేఖలు మారుతాయని ఆశించాం. మీరు ఎమ్మెల్యేగా విజయం సాధించి దాదాపు 60 రోజులు కావస్తోంది. అసెంబ్లీలో నియోజకవర్గం కోసం మాట్లాడారు. అక్కడి వరకు బాగానే ఉంది. కానీ ఎక్కడా పనుల్లో పురోగతి లేదు. అభివృద్ధి కుంటుపడింది. పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. సంక్షేమ పథకాలు సక్రమంగా అమలవుతున్నాయో? లేదో మీకే తెలుసు. ఆ విషయాన్ని మనం కాసేపు పక్కన పెడదాం. పాతనగరం బ్రిటీష్ కాలం నాటిది. అప్పట్లో విశాఖకు ఆర్థిక రాజధానిగా పాతనగరం నిలిచింది. బ్రిటీష్ వాళ్లు వెళ్లిపోయారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. దశాబ్దాలు ముగిశాయి. రోడ్లన్నీ ఇరుగ్గా ఉండేవి. ప్రధానంగా మెయిన్ రోడ్డు కూడా ఇరుగ్గా ఉండేది. పాతనగరం మెయిన్‌రోడ్డు విస్తరణకు నోచుకోలేదు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రోడ్డు విస్తరణకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. జగదాంబ జంక్షన్ నుంచి పాతనగరం రాణిబొమ్మ వరకు 60 అడుగుల రోడ్డు విస్తరణకు శ్రీకారం చుట్టారు. రోడ్డు విస్తరణలో దుకాణాలు కోల్పోయిన వారికి టీడీఆర్‌లు ఇచ్చారు. రోడ్డు విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ తరుణంలో ఎన్నికలు వచ్చాయి. అంతే.. అక్కడి నుంచి రోడ్డు విస్తరణ పనులు అటకెక్కాయి. ఎన్నికల కోడ్ ఉన్నందున దాదాపు రెండు నెలల పాటు విస్తరణ పనులు నిలిపేశారు. ఎన్నికలు ముగిసాయి. ఫలితాలు వెలువడ్డాయి. అనూహ్యంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దాదాపు 60 రోజులు కావస్తోంది. అంటే కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు 60 రోజులు, ఎన్నికల కోడ్ ఉన్నందున రెండు నెలలు కలిపి సుమారు నాలుగు నెలల పాటు రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయి. దీంతో పాతనగర వాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మీరంటే అభిమానంతో ఓట్లేసి గెలిపించాం. కానీ మీరు ఎక్కడా అభిమానం చూపడం లేదు. రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేసి న్యాయం చేస్తారని కోరుతున్నాం. అలాగే నియోజకవర్గంలో పారిశుధ్యం, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెడతారని ఆశిస్తున్నాం.

ఇట్లు

దక్షిణ నియోజకవర్గ ప్రజలు

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

మురళీనగర్: మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో శ్రీదేవి విజ్ఞానజ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. జీవీఎంసీ వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో డెంగ్యూ, ఫైలేరియా, మలేరియా వ్యాధుల వ్యాప్తి, వాటి నివారణ మార్గాల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఇళ్ల వద్ద పరిశుభ్రత పాటించడంతోపాటు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. వ్యాధుల లక్షణాలు కనిపించగానే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్‌పర్సన్ కె.కీర్తిపట్నాయక్, శానిటరీ సూపర్‌వైజర్ పి.జనార్దన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.